

# కథ తెచ్చిన వ్యధ

కుమారి సి.వి. రేవంతాల

కుమారి రజినిగారికి,

నమస్తే. ఇటీవల 'పత్రిక'లో ధారావాహికంగా వెలువడిన మీ "ఆదర్శాలు—ఆవేశాలు" నవల చదివాను. అది నన్నెంతగా ఆకర్షించిందో మాటలలో తెలుపలేను మొత్తానికి యింత మంచి కథ నేనిదివరకు ఎప్పుడూ చదువలేదంటే నమ్మండి. మీ నవలలోని 'మాధవి' పాత్ర నన్ను మరీ, మరీ కదిలించివేసింది. చదువు, సంస్కారము, సుగుణము గల స్త్రీగా మాధవి పాత్ర ఆ నవలకే నిండుదనాన్ని తెచ్చింది. చదువుకున్న స్త్రీలు అహంకారంతో కూడివుంటారనీ, వాళ్లలో ఏమాత్రం మంచి గుణాలుండవనీ, వాదించే మూర్ఖులకు, మీ 'మాధవి' చక్కటి పాఠం నేర్పిందండీ. పోతే, రఘు పాత్ర చిత్రణలో మీకు పురుష లోకం మీదున్న కసంతా తీర్చుకున్నారేమో ననిపించింది. విద్యావంతుడైన 'రఘు' సుగుణాల రాసి మాధవిని, కేవలం అందం లేదనీ, ధనవంతురాలు కాకపోవటం చేత తన అంతస్థుకు సరితూగదనీ, నిరాకరించటం అంత సమంజసంగా లేదేమో. అలాంటి అభిప్రాయాలు ఎక్కడో చదువు సంస్కారం లేనివాళ్లు కుంటాయిగానీ, నేటి సమాజంలో అలాంటి యువకులు లేరేమో. అదీకాక 'మాధవి' రఘులు బి.ఎ., యం.ఎ. కూడ ఒకే కాలేజీలో చదువుకుని స్నేహంగానే వున్నారు కదా. అలాంటిది మాధవి గుణగణాల్ని గొప్పదనాన్ని అర్థం చేసుకోలేక మూర్ఖునిలాగ ఆమెను తిరస్కరించాడంటే అంత బాగుండ లేదండీ. మొత్తానికి మీకు పురుషుల మీద అంత మంచి అభిప్రాయం లేదనుకుంటాను. పోనీలెండి. పురుష పాత్రలని మీరు నిర్దాక్షిణ్యంగా చిత్రించినా, స్త్రీ పాత్రలు మాత్రం అందరి అభిమానాన్ని చూరగొనేలా వున్నాయి నేను యింత సూటిగా అభిప్రాయాన్ని వ్రాస్తున్నందుకు కోపగించుకోకండేం. మరో మాట, నాకు రచయిత(త్రు)లతో పరిచయం చేసుకోవడం, ఆ పరిచయాన్ని స్నేహంగా పెంపొందించుకోవడమంటే సరదా మీ నుండి తప్పక జవాబు వస్తుందని నమ్ముతున్నాను అభిమాన పాఠకులను నిరుత్సాహపరచరనుకుంటా. కవరుపైనున్న అడ్రసుకు రిప్లైయిస్తారు కదూ.

మిమ్మల్ని అభిమానించే
సుధాకర్.

ఉతరం చదవటం ముగించిన రజిని చిన్నగా నవ్వుకుంది తన నవల, పోటీలో ప్రథమబహుమతి పొంది ప్రచురింపబడుతున్నప్పటినుంచీ తనకు పాఠకుల నుండి వచ్చే వుతరాలకు అంతేలేదు అందరూ తన నవల ఎంతో బాగుందని, దానికి ప్రథమ బహుమతి నివ్వటంలో ఆశ్చర్యమేమీ లేదని ఎంతో మెచ్చుకుంటూ వ్రాశారు ఈ సుధాకర్ ఎవరోగానీ విమర్శనా దృష్టితోనే చదివినట్లున్నాడు. ఫ్రమ్ అడ్రస్ చూచింది. ఫైనల్ యం. బి. బి. యస్, ఓహో మెడిసన్ చదువుతున్నాడన్నమాట. సాధారణంగా డాక్టర్లు సాహిత్యరంగంలో ప్రవేశించరు అలాంటిది, ఇతడింత విమర్శనా దృష్టితో చదివాడంటే గొప్ప మాటే. రఘు పాత్రను అంత వెనుకేసుకొచ్చాడేం? అంటే యితడు గుణాన్నేగానీ, అందచందాలను, డబ్బును అంత ప్రధానంగా తీసుకోడనా. ఇంతవరకు ఎవ్వరూ 'రఘు'ను గురించి అలా వ్రాయలేదు. ఆ పాత్ర చిత్రణ ఎంత సహజంగా వుందో తెలియజేయాలి.

వారం తిరిగేసరికి సుధాకరుకు జవాబు వచ్చింది.

సుధాకర్‌గారికి,

నమస్తే. మీరు అభిమానంలో వ్రాసిన వుత్తరాన్ని చదివాను అయితే అందులో నేను, మీరు సూచించిన పాత్రకు అన్యాయమేమీ అంటగట్టలేదనే అనుకుంటా. ఎంత ఆదర్శాలూ, ఆశయాలూ అంటూ వెయ్యి కంఠాలతో కోటి వేదికల మీద వుపన్యాసాలిచ్చినా తమ దాకా వచ్చేసరికి తల తడుముకోవటమే కదండీ నేటి యువకులలో చాలా మంది పైకి ఎంత ఆదర్శంగా యితరుల మెప్పు కోసం మాట్లాడినా తీరా తమ పెళ్లి ప్రసక్తి వచ్చేసరికి, అమ్మ, నాన్నల నెపంతో వేలకు వేలు కట్నంగా లాగ జూచేవారే. మరికొందరు సౌందర్యోపాసకులు చంచలమైన అందచందాలనే ఆరాదిసూ ప్రేమా గీమా అంటూ పెద్దల నెదిరించయినా సరే, ఓ అందాల బొమ్మను పెళ్లాడి తరువాత విరుద్ధ భావాలతో సంసారాన్ని నరకంగా తయారు చేసుకునే వారు మన అనుదిన జీవితంలో తారసపడూనే వుంటారు. ఇంకా కొంతమంది ఘనులు పై రెండు తెగలవారిని మించినవారు. "డబ్బు లేని అందం, అందం లేని ఆ డబ్బు, ఆనందం కావని తలచేవారు అలాంటి తెగకు చెందినవాడే 'రఘు'. చదువు, సంస్కారం వున్న వాళ్లకు అలాంటి అభిప్రాయాలు వుండవన్నారు కదూ మీరు. చదువుకు, మనిషి స్వభావానికి సంబంధం అందరి విషయంలోనూ ఒకేలా వుంటుందటండీ. అలా అవుతే ఇక మానవులంతా ఏకాభిప్రాయులుగా మారి, భూతలాన్ని నాకంగా మార్చరుటండీ! చదువు దారి చదువుదే, మనిషి దారి మనిషిదే అనే రకంగానే వుందికదండీ నేటి ప్రపంచం. అలాంటి వాడే 'రఘు' విద్యావంతుడైనా 'మాధవి'తో బాగా స్నేహంగా వున్నవాడే అయినా, తనలోని బలహీనతను జయించి అందము, డబ్బు లోపించిన ఆమెతో తన జీవితాన్ని ముడిపెట్టుకోలేక పోయాడు. ఇందులో ఆ పాత్రకు జరిగిన అన్యాయమేమీ లేదు. పురుషలోకంపై నాకు కసివుంటుందని ఎందుకు వూహించారు? 'రఘు' లాగే యువకులందరూ వుంటారని ఎక్కడైనా వ్రాశానా? మీరు మెడిసన్ చదువుతూన్నా సాహిత్యమంటే యిష్టమే ననుకుంటాను. మీరు సహృదయంతో చేసిన విమర్శకు సంతోషం.

రజిని.

ఉత్తరం చదువుకున్న సుధాకర్ కాస్త తెల్లబోయి తమాయించుకున్నాడు. 'ఎంత మంది ఆడపిల్లలతోనో, ఎన్నెన్ని రకాలుగానో తను ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతున్నాడుకానీ, ఏ అమ్మాయి కూడా ఏ విషయంలోనూ, ఎప్పుడూ యింత సూటిగా, ఘాటుగా సమాధాన మీయలేదు ఎంతయినా రజిని రచయిత్రి కదూ! చేతిలోని వుతరాన్ని మరో మారు చదువుకున్నాడు. వెరిగుడ్. తను మళ్లీ జవాబు వ్రాయడానికి అవకాశం వుంది.

రజిని గారికి

మీ జవాబు ఎనిసార్లు చదివానో చెప్పలేను. మొత్తానికి మీరు రచయిత్రు లనిపించుకున్నారండీ ఎంత నేర్పుగా సమర్థించుకోగలరు మీరు! అవున్లెండి. ఆ నేర్పే లేకపోతే అంత చక్కటి నవల వ్రాసి ప్రథమ బహుమతినెలా కొట్టగలిగేవారు! కానీ మీ వుతరంలో నన్ను బాధించింది ఒకే విషయమండీ! డాక్టర్లకు అసమానం రోగులు మందులే ప్రపంచ మనుకోకండి. వాళ్లనేదో ప్రత్యేక జీవులుగా వూహించకండి ప్లీజ్. మెడిసన్ చదివితే మాత్రం యితర రంగాలలో వుత్సాహముండదుటండీ! నామట్టుకు నాకు మంచి సాహిత్యమన్నా, కళాకారులన్నా ప్రాణమంటే నమ్మండి. నేటి యువకులలో చాలమందిని గురించిన మీ అభిప్రాయానికి బాధ కల్గిందండీ. 'చాలమంది లనేందు కంటే 'కొద్దిమంది' అంటే బాగుంటుందేమో! అందము, డబ్బు ఏమంత ముఖ్యమైనవండీ? ఎంతో అందమైన వాళ్లు కూడ వ్యాధిగ్రస్తు లయ్యే సరికి అంత కంటే వికారులు వుండరేమో అనిపించేలా తయారయే వారిని మేము సాధారణంగా చూస్తూనే వుంటాము ఇక, డబ్బు దేముందండీ ఈ దినం వుంటుంది, రేపు పోతుంది. మీరు మీ నవలలో చివరి వరకు నిలిచేది సహృదయము, గుణమేనని చక్కగా నిరూపించారు

మరోమాట. ఈ 'అండీ'లతో ఛస్తున్నానండీ. మీకు అభ్యంతరం లేకుంటే ఆ 'అండీ'లకు గుడ్‌బై చెప్పేద్దామని వుంది. మన స్నేహం కలకాలం నిలవాలని వీలయితే మిమ్మల్ని ఒక్కసారి చూడాలని కోరే

మీ స్నేహితుడు సుధాకర్.

ఉత్తరం పోస్టుచేసి వచ్చిన సుధాకర్ వూహా లోకంలో తేలిపోయాడు ఈవుత్తరం చూచిన రజిని తనపై ఏలాంటి అభిప్రాయాన్ని ఏర్పరచుకుంటుందో? తనకు అమ్మాయిలకు వుతరాలు వ్రాయడమంటే ఎంతో సరదా సరదాగా వుతరాలు రాసే వాళ్లని ఏడిపించటం మరీ సరదా కాలం గడిచే కొద్దీ తనకు పాత స్నేహాలతో విసుగెత్తుతుంది ఇంతవరకు ఏ అమ్మాయితోనూ పట్టుమని రెండేళ్లు స్నేహంగా వున్నది లేదు. కానీ ఈ రజినిలో మాత్రం చాలా కాలమే స్నేహం చేయాలనిపిస్తూ వుంది. ఈ రజిని ఎవరోగాని ఆ పేరులోని మాధుర్యంతోనే తనలో క్రొత్త వూహలు రేపింది. పేరే యింత అందంగా వుంటే ఇక మనిషి ఎంత అందంగా వుంటుందో. బహుశా పల్చగా, గులాబీరంగు శరీర కాంతితో, మీనాల్లాంటి చంచలమైన కళ్లతో చలాకీగా నాజూకుగా వుంటుందేమో.'

' "ఏరా బ్రదర్ తీరుబాటుగా వూహా లోకంలో విహరించేస్తున్నావ్? ఏ హీరోయిన్‌నయినా తోడు తీసుకున్నావా లేదా?" హాస్యంగా అడుగుతున్న భాస్కర్ పలకరింపులో వులిక్కిపడ్డాడు సుధాకర్.

చేతిలోని వుత్తరం వంకే చూస్తూ ఆలోచించ సాగింది రజిని ఏమిటి ఈ సుధాకర్! కొద్ది కలం పరిచయంతోనే కొంత చనువు తీసుకుంటున్నట్టు వుంది. అయితే యీ కాబోయే డాక్టరుగారు డబ్బుకు

# కథతెచ్చిన వ్యథ

ఆశించరన్నమాట. మంచిదే. డాక్టరుకు వుండవలసిన ముఖ్యమైన సుగుణాలలో అదీ ఒకటే. 'అండీ'లతో విసిగి పోతున్నాట్ట. పాపం. అంతమాత్రానికే విసుగైతే రేపు రోగుల కష్టాలను వినే సహనం ఏలా వస్తుందో. వీలయితే తన్ని చూడగోరు తున్నాట్ట. ఓహో, యీ కోరిక మరీ చాలా బాగుంది. ఈ పత్ర పరిచయాన్ని పెంచటం అట్టే క్షేమకరంకాదు.

"ఏమిటండోయ్, రచయిత్రి గారూ, అంత దీర్ఘాలోచనలో మునిగిపోయారు? ఎవరైనా కథానాయకుణ్ణి గురించా లేక కాబోయే మనోనాయకుణ్ణి గురించా..."

రజిని చేతిలోని వుత్తరాన్ని గమనించిన రాధిక రక్కున తన ధోరణి నాపింది.

"ఎవరు వ్రాశారేమిటి ఆ వుత్తరం? అంతలా దాన్ని చేతిలో వుంచుకొనే ఆలోచిస్తున్నావు?"

రజిని సమాధాన మీయకుండా లేచి వెళ్ళి ఇంతకుముందు సుధాకర్ నుండి వచ్చిన వుత్తరము, రెండూ కూడా రాధిక కిచ్చింది. త్వరత్వరగా వాటిని చదివిన రాధిక ఆశ్చర్యంగా రజిని వైపు చూచింది.

"ఇవేమిటే, సాధారణంగా నీవు పాఠకుల కెవ్వరికీ డైరెక్టుగా జవాబు లివ్వవు కదూ! ఈ సుధాకరుడు తన వుత్తరాలనే కిరణాల చల్లదనంతో నిన్ను కరిగించాడేమిటి?" హాస్యంగా నవ్వుతూ అంది రాధిక.

రజిని లకాధికారి రామయ్యకు ఏకైక గారాల బిడ్డ. లలి లేని లోటు తప్పితే ఇంకే లోటు లేదు ఆమెకు బి.ఏ. దాకా చదువు కుంది. ఎవరైనా ఒక్కసారి ఆమెకేసి చూసే కనీసం రెండు మూడు నిముషాల యినా తమ కళ్లను మళ్లించుకోలేని అందం ఆమెది. సెకండరీగ్రేడు టీచరుగా ఆ వూరికి వచ్చిన రాధికతో, అనుకోని విధంగా ఆమెకు ఒకనాడు దేవాలయంలో పరిచయ మేర్పడింది. వారి స్నేహలత వయస్సు సంవత్సరమే అయినా, త్వరగా పుష్పించి ఫలించింది అందుకే వారిద్దరూ ఎంతో చనువుగా హాస్యాలాడుకుంటూ వుంటారు.

"ఛ ఛ! అలాంటిదేమీలేదు. ఎందరి వుత్తరాలో వచ్చాయి కానీ యింతవరకు ఎవ్వరూ అంతగా విమర్శించలేదు. ఆ విమర్శే నన్ను జవాబు వ్రాసేలా చేసింది. ఇక యింటితో స్వస్తి పలుక దలచానులే." సమాధానంగా అంది రజిని.

"సరేకానీ, యీ డాక్టరు మహాశయుడు కాస్త ఆదర్శభావాలు కలవాడుగా కన్పిస్తున్నాడు కదూ! యీ వుత్తరాలను చూసే."

"ఆ ఆ, కబుర్లలో అలాంటి ఆదర్శాలు యెన్నయినా దొర్లుతాయి కానీ, వాస్తవికత లోకి వచ్చేసరికే వున్న చిక్కంతాను."

హాల్లోంచి ఎందుకో రామయ్యగారు 'రజిని' అని కేకేయటంతో వాతావరణం మారింది.

'రెండునెలలు గడిచినా రజినీ నుండి జవాబేలేదు. ఏమై వుంటుంది చెప్మా' అంటూ ఈజీచైర్‌లో కూర్చుని సిగరెట్టు పొగను మేఘాల్లా వదులూ ఆలోచిస్తున్నాడు సుధాకర్. ఆదివారం కాబట్టి కాలేజీ గొడవలేదు. 'తను ఏమంత తప్పుగా వ్రాశాడని కోపం తెచ్చుకోడానికి? అలా అయివుండదు. ఏమైనా సుసీ చేసిందేమో! ఛ. పాడు ఆలోచన. అందంగా వుండాల్సిన తన రజినిని రోగిలా వూహించకూడదు. బహుశః రజిని చాలా అందంగానే వుండి వుంటుంది. ఎందుకంటే 'అందమైన వాళ్లే తెలివిగలవారిగా వుంటార'ని అంటాడు వెంకట్రావ్. అదీ నిజమేమో. వీలయితే రజనిని తనదాన్నిగా చేసుకోవాలి. రజని మాత్రం తనలో ఏమిలోటు చూపెట్ట గలదు? రజినికి తనే మళ్లీ ఓ వుత్తరం రాసే' అనుకుందే తడువుగా లెటర్‌పాడ్ పెన్ను తీసుకున్నాడు.

డియర్ రజినీ,

ఇటీవల నీ నుండి జాబేలేదు. కొంపదీసి నా మీదేమైనా కోపం వచ్చిందా? నా అభిప్రాయాలేవైనా నీకు విరుద్ధంగా తోచాయా? ఎందుకింత మౌనం వహించావు? అడుగడుగునా ఓ సవాలు లాగ వుండి కవ్వించే నీ వుత్తరాలు చూడకపోతే బ్రతకటమే వృధానేమో అనిపిస్తూ వుంది ఇంకా ఎన్నాళ్ళు జవాబు వ్రాయకుండా వుండ దలచావు? కొత్త కథలు సృష్టించటంలో బిజీగా వున్నావా ఏమిటి?. ఏలాగైనా కొద్ది సమయం నాకోసం కేటాయించు నీ ఫొటో కూడా పంపుతావుకదూ? నిన్ను కనీసం అలా అయినా చూస్తూ వుంటాను. కావాలంటే నా ఫొటో కూడా పంపగలను. వెంటనే జవాబు వ్రాయి.

నీ ప్రాణస్నేహితుడు
సుధాకర్.


వుత్తరంపూరి చేసి తృప్తిగా గాలి పీల్చుకున్నాడు. ఆదివారమన్నైనా అనుకోకుండా. వెంటనే పోస్ట్‌చేసి వచ్చాడు.

దాదాపు యిరవైదినాలయినా రజని నుండి జవాబు రాకపోయేసరికి సుధాకర్ వూహలు తల్లక్రిందులయ్యాయి! 'రజినికి కోపం వచ్చిందేమో! కోపం వస్తే చీవాట్లు పెడూ అయినా వ్రాయదూ, హాయిగా, సరదాగా వుత్తరాలు రాసేందుకేం? ఛీ, ఏమి ఆడవాళ్ళో, వీళ్లకి యీ నిమిషాన వున్న బుద్ధి మరో నిమిషానికి వుండదు. మొదటో వెంటనే జవాబిచ్చి యిప్పుడే మొచ్చిందని మానేసిందో. బహుశః తన వుత్తరం చేర లేదేమో. అంతే అయివుంటుంది. ఇంకోటి తనే రాసే మాత్రం పోయేదేముంది? రజిని రాసినవుత్తరం గర్వంగా స్నేహితులకు చూపించాడు కానీ యిప్పుడు వాళ్ళు, "ఏం బ్రదర్, మీ రచయిత్రి అప్పుడే గుడ్‌బై చెప్పిందా?" అంటూ ఎగతాళి పట్టిసుంటే తను ఎంత సిగ్గుతో చచ్చిపోతున్నాడు. ఏలాగైనా ఆమె నుండి జవాబు తెప్పించాలి.

ప్రియమైన రజనికి.

నేను వ్రాసే వుత్తరాలు నీకు సరిగా అందటంలేదా? అవునే, చేరితే జవాబు ఎందుకు వ్రాయవు? ఏమిటోగానీ నీ వుత్తరాలు రాకపోయేసరికి నిజంగా పిచ్చి పట్టినట్టే వుంది. కాలేజీకికూడ వెళ్ల బుద్ధి కావటం లేదంటే నమ్ము. అస్తమానం నీ

(46 వ పేజీ చూడండి)



రూపురేఖల్ని వూహించు కోవటంతోనే సరి పోతూ వుంది. నిన్ను చూడాలనీ, ఏవేవో మాటాడాలనీ నా మనసు తహతహ లాడు తోంది. నీ పేరే అంత అందంగా వుంటే యిక నీ వెంత అందంగా వుంటావో. నీకు

## కథ తెచ్చిన వ్యథ

(12వ పేజీ తరువాయి)

మాత్రం యింతగా నిన్ను అభిమానించే ('ప్రేమించే' అంటే బాగుంటుందేమో) నన్ను చూడాలని లేదూ. మన యిరువురి అభిప్రాయాలూ ఒకేలా వుంటాయి కదూ! నా విద్యార్హతలు అవీ తెలుసు కదూ! ఇక అట్టే మౌనం వహించకు దేవీ!

నీ, సుధాకర్.

"ఈ వుత్తరానికి జవాబీయకుండా వుంటుందా. తను వుత్తరాలు వ్రాసే అమ్మాయిలు చాలామంది యిలాంటి వుత్తరాలకు కరిగిపోయిన వారే ఎంత గడుసుదాన్నయినా తను మాటలతో కరిగించేయ లేడా" ఆలోచిస్తూనే వుత్తరాన్ని వదిలాడు సుధాకర్.

"మళ్ళీ యిదేదో వచ్చింది చూడు రాధీ. ఈ వెధవ ఎక్కడ దాపురించాడో కానీ, మనల్ని వదిలేలాలేడు వీడుత్తరాలూవీడూను." సుధాకర్ రాసిన వుత్తరం చూపెడ్తూ అంది రజని.

చదవడం ముగించిన రాధిక, "ఓహో ఏవిటేమిటో తెగవ్రాశాడే, ప్రేమలేఖలా. ఈలా యెంతమంది ఆడపిల్లలతో ఆట లాడుతున్నాడో ఈ రాస్కెల్" కోపంగాలంది.

"ఈలాంటి వాళ్ళకు సరిగా బుద్ధి చెప్పాలి. వూహాలోకాల్లో తేలిపోతూ వెధవ రాతలన్నీ రాస్తూ ఆడపిల్లల్ని అవమాన పరచటం వీడికి బాగా అలవాటున్నట్లుంది. నీవు 'వూ' అంటే వీడికి మంచిపాఠం నేర్పుదాం" అంటూ తన ప్లాను చెప్పింది.

"అలాగే. ఇప్పుడే రాసిపడేయ్ ఈ దెబ్బతో వాడికి పట్టిన దయ్యం వదుల్తుంది." ఒప్పుకుంది రజిని ప్లానుకు రాధిక.

డియర్ సుధాకర్,

నా వుత్తరంరాకుంటే పిచ్చి పటి నటు వుందా? డాక్టర్లే పిచ్చివారైతే ఇక రోగులగతి అధోగతే మీ అభిప్రాయాలు తెలుసుకున్న నాకుచాలాసంతోషమయింది! మిమ్మల్ని చూడాలని వుంది మర్నాడు సాయంత్రం మూడు గంటలకు రండి. నేను స్వయంగా స్టేషనుకు వస్తా. మిమ్మల్ని రిసీవుచేసు కుందుకు ఎర్రటి చీర, అదే రంగు జాకెట్టు వేసుకుంటా. నన్ను గురించ గలరుగదూ.

రజిని.

పదేపదే వుత్తరం చదువుకున్న సుధాకర్ ఎగిరి గంతేశాడు. వెరిగుడ్. తన వూహా సుందరి ప్రత్యక్ష దేవతగా మారి, వరం ప్రసాదింప బోతూంది సరదాగా కొన్నాళ్ళు కాలక్షేపం అవుతుంది.

మరుసటి దినం వుదయం బ్యాగులో రెండు జతల గుడ్డలు కుక్కుకొని స్టేషన్‌కు వరుగెత్తాడు. రైలుకంటె ముందే సుధాకర్






మనస్సు రజినిని చేరుకుంది. తాను దిగాల్సిన స్టేషనొచ్చింది కూడ తెలీ లేదు.

"బాబూ ఈ స్టేషన్‌లోనే కదూ మీరు దిగాలన్నది." అంటూ తన నింతకు ముందు వాకబు చేసినాయన హెచ్చరించే వరకు వూహాల్లో మునిగి తేలుతున్నాడు. గబగబా బ్యాగ్ తీసుకొని రైలు దిగాడు. ప్లాట్‌ఫారమ్ మీద అంత రద్దీ గాలేదు. ఎర్రచీర కోసం ఆత్రంగా వెదుకుతున్న అతడి కళ్ళు ఒకచోట టక్కున ఆగిపోయాయి. ఎవరో ఎర్రటి చీర జాకెట్టుతో తనవైపే వస్తూంది. రజినీనే అయివుంటుంది. ఆవిడ దగ్గరగా వచ్చేస్తూంది. ఆమె నా రజిని? నిశ్చేష్టుడయి చూశాడు. ఛా. ఆవిడ రజిని ఏలా అవుతుంది? నల్లగా ముఖమంతా స్ఫోటకం మచ్చలతో నిండి వున్న ఆవిడ రజిని ఎప్పటికీ కాదు. మరి ప్లాట్‌ఫారం మీద ఇంకే ఎర్ర చీరా లేదే!

"నమస్తే. సుధాకర్‌గారు మీరే కదూ." రెండుచేతులు జోడించి చిన్నగా నవ్వుతూ అంది ఆవిడ

సుధాకర్ తల గిర్రున తిరిగినట్లయింది.

అనుకోకుండానే "నమస్తే" అన్నాడు అలాగే చూస్తూ.

"అలా చూస్తారేం? రండి బయటికి వెళ్దాం."

"తను చూస్తున్నది కలా నిజమా? కొంపదీసి ఈవిడెవరో ఇంకో సుధాకర్ కోసం రాలేదుకదా" అనుమాన మొచ్చింది సుధాకర్‌కు.

"ఏమండీ నేనే సుధాకర్‌నని ఎలా అనుకున్నారు?" అనుమాన నివృత్తి కోసం అడిగాడు.

"ఇది మరీ బావుందండీ. నేను మీకు రాసిన ప్రకారం ఎర్ర చీరతో వచ్చాను. మీ చూపులు ప్లాట్‌ఫారమంతా గాలించి నా చీర మీదే నిలిచాయి. ఇక మిమ్మల్ని పోల్చుకోవడం ఏమంత పెద్ద కష్టమంటారు? అన్నీ యిక్కడే మాట్లాడేలా వున్నారు ఇంటికి వెళ్దాం పదండి." పెదవుల మీద నవ్వు సన్నగా కన్పిస్తూ వుంది.

"ఇదే నండోయ్ మా యిల్లు. స్టేషన్ నుంచి పదడుగులయినా లేదుకదూ! అందుకే మిమ్మల్ని నడిపించే తీసుకొచ్చాను." ఇంటి తాళం తీస్తూ అంది.

అంతవరకు గుడ్డిగా అనుసరించిన సుధాకర్ ఈ లోకంలోకి వచ్చాడు.

"రండి లోపలికి అలాగే నించుండి పోయారేం?" అన్న ఆవిడ మాటతో యాంత్రికంగా లోపలికి నడిచాడు.

"బాగా అలసినట్లున్నారు. అదో, అదే బాత్‌రూం. బ్యాగలావుంచి కాళ్ళు ముఖం కడుక్కుంటారో, స్నానమే చేస్తారో మీ యిష్టం."

ఇంట్లో ఎవరూ లేనట్లుందే. తనూహించిందివేరు. జరుగుతున్నది వేరూను. ఆలోచించే సుధాకర్‌కు ముచ్చెమటలు పోస్తున్నాయి.

"ఆలా నించుండి పోయారేమిటండీ. కాళ్ళు కడుక్కుని రండి కాఫీ తాగుదురు కానీ."

'కాఫీకాదు. విషం కావాలి' అని అర వాలనుకుని చేతకాక బ్యాగ్ పడేసి, బాత్ రూంలోకెళ్ళి కాళ్ళు ముఖం చల్లగా కడుక్కున్నాడు.

'ఆలా కూర్చోండి. కాఫీ టిఫెన్ పట్టుకొస్తా' నంటూ లోపలికెళ్ళి రెండు ప్లేట్లతో వుప్మా, కాఫీ ఫ్లాస్కు, గ్లాసులూ పట్టుకొచ్చింది.

'తీసుకోండి' అంటూ ప్లేటు ముందుకు జరిపింది.

ఒక్క మాటైనా మాట్లాడడానికి తోచలేదు సుధాకర్‌కు. చివరికెలాగో 'మీరూ తీసుకోండి' అన్నాడు.

"ఇదిగో నాకూను. ఏమైనా, మీ కాలేజీ సంగతులు చెప్పండి. అంత హుషారుగా వుత్తరాలు రాసిన వారు యింత


తెల్ల మచ్చలకు ఉచిత వైద్యము

శక్తివంతమైన మా ఆయుర్వేద ఔషధము "శ్విత్ర మోచన్" తెల్ల మచ్చలను కొద్ది రోజులలో తొలగించును. సాంఘిక సంక్షేమం కొరకు 1000 రోగులకు ఒక్కొక్క పాకెట్ ఉచితంగా యివ్వబడును. వెంటనే వ్రాయండి.

BIHAR KUSTA KUTIR
(2) P.O. Lalbigha (Gaya)



పండిత
డి గోపాలాచార్యులవారి

ఓజామృతం

ఆరోగ్యానికి బలానికి

ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17



చంటిపాపలకు,
చిన్న బిడ్డలకు
కడుపునొప్పి రోగాలకు

బెంగాల్ కెమికల్స్
గ్రైప్ మిక్చర్



తేలికగా విరేచనమయ్యే మందులు గలిగి, పాపలకు, బిడ్డలకు అజీర్ణశక్తిలోపముల నివరించును. ఆరోగ్య హానికరము లేవియు ఇందులో లేవు




బెంగాల్
కెమికల్

కలకత్తా * బొంబాయి
కాన్పూర్

వకోనంగా వున్నారేమండీ?" నొక్కినొక్కి మాటాడుతోంది

"అబ్బే ఏమున్నాయి. మీ నవలలు కథలు చాలా బావుంటాయి అందుకే మీతో స్నేహం చేయాలనిపించింది కానీ " మాటలకు వెతుక్కున్నాడు.

"ఇప్పుడు ఒద్దనిపిస్తుందా ఏమిటండీ కొంపదీసి"

# కథ తెచ్చిన వ్యధ

"అబ్బెబ్బే, అదికాదండీ మీ యింటో ఇంకెవ్వరూ లేనట్టుందే." సన్నగా అన్నాడు.

"ఎవరూ లేరండి. నేను ఒక్కదాన్నే. చిన్నతనంలోనే తల్లి తండ్రి పోయారు. మేనమామ సహాయంతో యస్సెల్సీ పాసై సెకండరీ గ్రేడు టీచరుగా యిప్పుడు పని చేసు న్నాను. ఈ రోజు మీరొస్తారని లీవు పెట్టాను. నాకు చిన్నపాటి నుండి తెలుగు సాహిత్యమంటే తగని పిచ్చి. ఎప్పుడూ ఏదో నా చదవడం వ్రాయడం నా అలవాటు.. ..."

ఇంకే మాటలు సుధాకర్ చెవులో దూరలేదు. ఈ లాంటి సాధారణ స్త్రీ తో తనకు సరదా ఏమిటి. వెధవ చచ్చు కథలు కావాలంటే ఎవడు రాయలేడు ఛీ ఛీ దరిద్రపు ముఖం.

"ఏమండోయ్ మిమ్మల్నే అంత ఏక ధ్యానంగా వున్నారేమిటండీ. టిఫిన్ అయ్యి పోయినా వుత్తి చేయి ఆలాగే వుంచుకుని ఆలోచిస్తున్నారు. అందులో నే కడిగేసు కోండి. కాఫీ తీసుకుందురు గాని." అతడి మనో భావాల్ని పసికడుతూ అంది. కడుక్కుని ఒక్క గుక్కలో తాగేశాడు కాఫీ.

"ఇప్పుడు చెప్పండి. ఏమేమో మాట్లా డాలని వుందని వ్రాశారే"

"ఆ ఏమున్నాయి. ఏమిటో వ్రాశాను కానీ......" నసుగుతూ అన్నాడు.

"అయితే రాసే దానికీ చేసే దానికీ సంబంధం లేదంటారా?" నిలదీసి అడి గింది.

"ఆ... హా, వూ....." తికమక పడ్డాడు.

'ఎందుకొచ్చిన బాధరా బాబూ. వూరికే వుండలేక కోరి తెచ్చుకున్నాడు వెధవ గొడవ.' తన్ను తానే మనసులో తిట్టు కున్నాడు

"మీ వుత్తరాలు చూచి వూపిరి సలుపుకోకుండా మాట్లాడుతారేమో నను కున్నాను సుమండీ. ఇంత గంభీరంగా వుంటారనుకోలేదు." కాస్త ఎగతాళి ధ్వనిం చింది కంఠంలో.

'వూపిరి సలుపుకో లేకుండానే అయి పోయింది పరిస్థితి' అనుకొని "మీ కథలు చాలా బాగుంటాయి. ఏవైనా క్రొత్త వి రాస్తున్నారా? మా కాలేజీలో అందరూ మీ కథలంటే పడి చస్తారు." అన్నాడు కంఠస్థం చేసిన మాటలను వల్లించినట్టు .

"అవుతే మీ కాలేజీ శాశ్వితంగా మూత పడి పోతుందే పాపం" కాస్త గట్టిగానే నవ్వింది.

'గట్టి పిండమే. ఎంత గడుసుతనంగా మాట్లాడుతుందీ. ఛ, తన కేమయ్యింది? సరియైన సమాధానాలే చెప్పలేక పోతున్నా డేం? ఆడపిల్ల ముందు తెల్లబోవడ


బుతుక్రమం ఆలస్యమైతే?

విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన దేవి పిల్సు వాడండి

పూర్తికోర్సు ప్యాకెట్టు 28 మాత్రలు వెల రు 11/- సగం కోర్సు ప్యాకెట్టు 14 మాత్రలు వెల రు 6/50 వి. పి. ఖర్చు అదనము ప్రతి చోటదొరుకును



'దేవి పిల్సు' ముఖ్యంగా ఆలస్యమైన క్రమముగాకాక పోయిన, బాధతో కూడిన, లేక ఆగిపోయిన బహిష్టుకు దేవి పిల్సు బాగుగ గుణమిచ్చును

1 అన్ని సందర్భములలోను శీఘ్రముగాను, అమోఘము గాను పనిచేయును 2 ఏస్థితిలోను ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగింపదు

MFRS SEENU & CO. MADRAS-21

స్టాకిస్టులు. సిటీ ఫార్మ డిస్ట్రిబ్యూటర్స్, రాంగోపాల్ వీధి, విజయవాడ 1





నిడుపాటి నిగనిగలాడే వెంట్రుకలకై



కేశవర్ధిని

వాడండి.

వాడుటకు తయారుగా

కేశవర్ధిని రెడీ మిక్స్‌డ్

హెయిర్ ఆయిల్

వెంట్రుకల శుభ్రతకు, సువాసనకు

కేశవర్ధిని షాంపూ ఉపయోగించండి.

కేశవర్ధిని ప్రొడక్ట్స్, మద్రాసు-14.



ఏజంట్లు:
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)

నెలకు రు 400/—సంపాదించండి
డ్రాయింగ్ & పెయింటింగ్ గైడ్

ఫ్రీ హాండ్ డ్రాయింగ్, స్టెన్‌సిల్, సైన్‌బోర్డు తయారుచేయుటకు, రంగులస్కీముతో పెయింటింగ్ చేయుటకు లెటరింగ్ మరియు యితర డ్రాయింగ్ పనులకు మీకు ఉపయోగపడు 400 చిత్రపటములు గల సంపూర్ణగైడ్. ఈ పుస్తకముయొక్క సహాయముతో మీరు ఉత్తమ డ్రాయింగ్‌మాస్టరు, పెయింటర్, డ్రాఫ్ట్స్‌మెన్ లేక డిజైనరు (Artist) కావచ్చును. ధర రు 6/— పోస్టేజి రు. 1/25. పచిత్ర ట్రాన్సిస్టర్ రేడియోగైడ్—తక్కువ పెట్టుబడితో ట్రాన్‌సిస్టర్ తయారుచేయు పద్ధతి రు. 4/—, 350 ఎంబ్రాయిడరి డిజైన్ల పుస్తకం రు. 6/—. ఎలెక్ట్రిక్ ఇంజనీరింగ్ పుస్తకం రు 6/—

ILFA BOOK DEPOT (JPR)
Rafatganj, Aligarh (UP)

ఫోల్డింగ్ 50 షాట్ పిస్టల్

లైసెన్స్ అక్కరలేదు. అమెరికన్ మోడల్. దొంగలు, క్రూరమృగముల నుండి రక్షించుకోండి. ఉల్లాస ప్రయాణాలు, యాత్రలు, నాటకాలకు ప్రశస్తమైనది. ఆటోమేటిక్ 50 షాట్లు ఏర్పాటు గలదు. తేలికైనది. ఇందు నుండి వెలువడు నిప్పు రవ్వలు మిమ్మును కాపాడును. ధర 50 షాట్లు




జర్మన్ మోడల్ నెం 99 రు. 15/50. వి.పి.పి. చార్జీలు రు. 2/50. లెదర్ కేస్ రు. 3/50 అదనపు షాట్లు 100 కి రు. 5/—.

JAPAN AGENCIES (WAT-15)
Beat No 13 Aligarh


# కథతెచ్చిన వ్యథ

మేమిటి. ఇన్‌సల్ట్.' లో లోపలే వుడికి పోయాడు.

"సరే కానీండి. మీ ఆశయాలు నాకు చాలా బాగా నచ్చాయండీ. గుణానికి, తెలివికే ప్రాధాన్యత నిచ్చే మీలాంటి యువకులు అరుదే. పెద్ద చదువుకు తోడు వున్నతాశయాలు గల మీరు భవిష్యత్తులో ఎంతైనా రాణిసారు."

ఆమె మాట లతనికి సూటిగా తగులన్నాయి.

"ఛీ ఛీ, పొద్దుపోక లేనిపోని రాతలు రాసి నెత్తికి తెచ్చుకున్నాడు ఏలా అయినా యిక్కడి నుండి బయట పడితే రాణించినట్టే. బుద్ధి గడ్డితిని ఈ పనిచేశాడు" లోలోపలే బాధ పడ్తున్నాడు

"ఏమండోయ్ టీచరు గారూ ఏం జేస్తున్నారు! ఓ హో వీరు ఆదర్శమూర్తులు డాక్టరు సుధాకరు గారు కదూ!" అకస్మాత్తుగా సుడిగాలిలా గదిలోకి వచ్చి తనతో పరిచయమున్నట్టు గుర్తించిన ఆ అందాలరాసిని దిగ్భ్రమచెంది చూశాడు సుధాకర్. అలా చూస్తూ అచేతనంగా ఎంత సేపున్నాడో కానీ,

"అలా చూస్తారేమిటండి. ఈవిడ మిస్ సుధారాణి బి. ఎ. నా డియరెస్ట్ ఫ్రెండ్." అనే మాటలు వినిపించేవరకు ఏదో లోకంలో వున్నట్టే వున్నాడు.

"ఈయన సుధాకరే సుధా. సరిగానే కనిపెట్టావే" రజిని పరిచయం చేసింది.

"నీవు చెప్పావు కదూ. మూడింటి కల్లా వస్తారని" అని సుధాకర్ వైపు తిరిగి "నమస్తే" అంది సుధారాణి తమాషాగా కళ్ళు తిప్పుతూ.

తామర మొగ్గల్లావున్న ఆమె చేతుల వంకే చూస్తూ "నమస్తే" అన్నాడు.

"రజనికి, నాకూ మధ్య రహస్యాలు లేవులెండి. క్షీర నీరన్యాయంగా వుంటుంది మా స్నేహం. అందుకే ఆదర్శ భావాలతో నిండిన మీ వుత్తరాలు నాకు చూపెడ్తూ వుంటుంది. మొత్తానికి మీరు బలే వారండీ. మీలాంటి వారు కొద్ది మంది వున్నా చాలు సంఘానికి మీలాంటి వారు స్నేహితులు కావడం అదృష్టమే. ముఖ్యంగా మీకు రచయిత్రులంటే ఎంత గౌరవభావ మండీ! మీలా ప్రోత్సాహమిచ్చే వారు ఎక్కడ దొరుకుతారు." వీణలో మీటినట్లుగా వున్నాయి పలుకులు.

ఆ కళ్లలో ఏదో దాచినా దాగని కొంటెతనం తొంగి చూస్తూవుంది మంత్రముగ్ధుడిలా ఆ సుధారాణి వంకే చూస్తున్నాడు సుధాకర్.

"ఏమండోయ్. అంతగా చూడకండి. మా స్నేహితురాలికి దిష్టి కొడుతుంది." గలగలా నవ్వుతూ అంది రజిని

ఈపాడు మోహ మొకటి మధ్యన. ఈ సుధారాణే తాను కోరిన రజిని కాకూడదూ. ఆమెతో అయితే ఎంత హుషారుగా మాట్లాడేవాడు. ఈ దరిద్రపు ముఖాన్ని చూస్తే వున్న వుత్సాహమంతా చప్పగా చల్లారి పోతుంది కూడాను. చూపులు మళ్లించుకొన్న సుధాకర్ మనసులోనే విసుక్కున్నాడు.

"పోన్లెండి. మా రజిని అదృష్టవంతురాలు. లేకుంటే మీలాంటి వారు 'ప్రేమించాను' అని వ్రాయట మంటే సామాన్యమా. అయితే పెళ్లి భోజన మెప్పుడండోయ్ మాకు" గుక్క తిప్పుకోకుండా మాట్లాడేస్తోందావిడ

'దరిద్రం రజిని నేం కర్మ. నీవువూ అంటే అందర్నీ యెదిరించి అయినా నిన్నే చేసుకోనూ' సుధాకర్ మనస్సు బాధగా మూల్గింది

"అవును.... అబ్బెబ్బే .... పెళ్లా? దానికేం తొందరండీ. ఇంకా నాచదువు అదీ అవ్వాలికదూ" తడబడ్తూ అన్నాడు.

ఇంతసేపటినుండి అతడి ధోరణి తిలకిస్తున్న ఆవిడ యిక తన కోపాన్ని నిగ్రహించుకోలేక పోయింది.

"అవునవును. పెళ్లికేం తొందర. సరదాలూ ఆదర్శభావాలు అంటూ ఆడపిల్లలకి వుత్తరాలు రాయడానికే తొందర కాని. నిజం చెప్తున్నాను విను. నాపేరు సుధారాణి కాదు. నీవను కుంటున్నట్టు ఈమె రజినీ కాదు. నేను రజినిని. ఈమె నా స్నేహితురాలు రాధిక."

వెర్రి చూపులు చూశాడు సుధాకర్.

"నీవు స్టేషన్‌లో ఎర్ర చీరావిడే నేననుకొని రాధికను చూచిన క్షణంలో, నీముఖంలో రంగులు ఏలా మారిందీ గమనించలేదనుకున్నావా. అప్పుడే నీ అసలు రంగు పసిగట్టాను. నీడలా అనుసరించి వచ్చి వరండాలో నుండి నీ పరిస్థితి అంతా గమనిస్తూనే వున్నాను. మిస్టర్, యిదేం చిన్న పిల్లల బొమ్మలాట కాదు. ఆడ పిల్లల జీవితాలతో చెలగాట మాడటమేనా సరదా నీకు? పెద్దలతో చెప్పి

నీ యెముకలు చితక పొడిపించాలను కున్నాను. కానీ నీమీద దయ దలిచే మంచిగా బుద్ధి చెప్పాలను కున్నాను. జాగ్రత్త. ఇక మంచైనా, ఆడ పిల్లలతో జాగ్రత్తగా వ్యవహరించు. వాళ్లకు గౌరవం, అబిమానం వుంటాయనే సంగతి మరిచి పోకు. ఏదో వ్రాశావని జవాబిస్తే అమర్యాదగా, పొగరుబోతు రాతలురాస్తావా. ఇవేనా నీ ఆదర్శాలూ ఆశయాలూను డామిట్! బుద్ధిగలిగుండు.'' కోపంతో వూగి పోతూంది రజిని. దెబ్బ తిన్న ఆడ సింహంలా గర్జిస్తూంది ఆమె.

సుధాకర్ ముఖం అవమానంతో నల్ల బడి పోయింది. వంచిన తల యెత్త లేక పోయాడు.

''ఇక పోనీ రజినీ పాపం ఏదో బుద్ధి గడ్డితిని అలా చేశాడు. తనలో లేని భావాలను చాటుకొని ఆదర్శవాది కావాలను కున్నాడు పాపం'' రాధిక కాస్త సాను భూతి చూపింది.

సిగ్గుతో చచ్చిపోయాడు సుధాకర్. ఈలాంటి పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని ఎన్నడూ వూహించలేదు చేజేతులా చేసుకున్నాడు తను. నిజంగానే అందమైన అమ్మాయిలంటే పడి చచ్చే తాను ఈ కోతలు ఎందకు కోయాలి? వీళ్లతో యింత అవమానం ఎందుకు పొందాలి. ఛీ రాక్షసుల్లాంటి ఆడపిల్లలు. ఎంత అవమానం! రోషంతో ముఖం ఎర్ర బడింది. ఒక్క వుదుటున లేచి బయట పడ్డాడు

''ఏమండోయ్ మీ బ్యాగ్'' పరుగున బయటికి తీసు కొచ్చింది రాధిక.

''థాంక్స్'' కసిగా తనలోనే గొణు క్కున్నాడు.

''ఈ 'అండి' లకు గుడ్ బై కొట్టాం రాండి'' వెనుక వైపు నుండి సూటిగా వచ్చిన మాటలు పక పకలు మరి కాస్త వేగంగా పరుగు తీయించాయి సుధాకర్‌ను. ●

కాలసాహితి




## మౌల్వీ నసిరుద్దీన్ - కథలు

*మహీధర్ నళినీ మోహన్

ఒకనాడు సంభాషణల్లో ప్రసంగ వశాత్తూ తైమూరు మౌల్వీ నసీరుద్దీన్‌ని అడిగేడు.

''స్వర్గం పెద్దదా? నరకం పెద్దదా?'' ఆ ప్రశ్న విని అందరూ ముఖముఖాలు చూచుకున్నారు. అది నిజంగా అపూర్వమైన ప్రశ్న.

మౌల్వీ తడుముకోకుండా జవాబు చెప్పేడు.

''స్వర్గమే పెద్దది.''

''ఆ సంగతి నీకెల్లా తెలుసు?''

''ప్రపంచంలో భాగ్యవంతులకన్న, బీదవాళ్ల జనాభాయే ఎక్కువ కనుక'' అని మౌల్వీ సమాధానం ఇచ్చాడు. ●






అమృతాంజన్
లిమిటెడ్‌వారి
గ్రైప్ మిక్స్‌చర్

తయారీ:
అమృతాంజన్ లిమిటెడ్, మద్రాసు-4

FDS AGM 472 TE